ప్రజాశక్తి

సోమవారం 17 ఫిబ్రవరి 2025 5

అనంతపురం



కునారిల్లుతున్న సిపిడబ్ల్యుఎస్‌లు

- వేతనాల కోసం కార్మికులకు తప్పని వెతలు
- నిర్వహణకు తప్పని ఇక్కట్లు
- 14 ఏళ్లుగా అవే ఫిల్టర్ బెడ్స్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని అందించాలన్నది ప్రభుత్వం లక్ష్యం. ప్రతి పౌరుడికి రోజుకు సగటున 55 లీటర్ల నీటిని గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ మేరకు జల జీవన్ మిషన్ అనే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ఏడాదిలోపు అన్ని ఇళ్లకు వ్యక్తిగత కుళాయి కనెక్షన్‌తోపాటు తాగునీరు అందివ్వాలన్నది లక్ష్యం. అయితే ఇది జరగాలంటే కీలకంగా ఉండాల్సినది బహుళ రక్షిత మంచినీటి పథకాలు (సిపిడబ్లుఎస్). ఉమ్మడి అనంతపురం జిల్లాలో బహుళ రక్షిత మంచినీటి పథకాలు మొత్తం 67 ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 48కాగా, సత్యసాయి జిల్లాలో 19 ఉన్నాయి. ఇందులో అత్యధిక గ్రామాలకు తాగునీటిని అందించే పథకాలు సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాలు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కింద 850 గ్రామాలకు నీటిని అందిస్తుండగా, సత్యసాయి కింద 1125 గ్రామాలున్నాయి. ఇవి కాకుండా తక్కినవి చిన్నచిన్న తాగునీటి పథకాలు నడుస్తున్నాయి.

ప్రధాన తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణే అంతంత మాత్రం

జిల్లాలో అతి పురాతనమైనది సత్యసాయి తాగునీటి పథకం. 1995లో ఇది ప్రారంభమైంది. అంటే ఇప్పటి సరిగ్గా 30 సంవత్సరాలవుతోంది. అప్పట్లో వేసిన ప్రధాన పైపులైన్‌లో చాలా వరకు దెబ్బతిని ఉన్నాయి. దీంతో తరచూ అనేక చోట్ల మరమ్మతులకు గురవుతున్నాయి. ఇక శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ప్రారంభమై కూడా 14 సంత్సరాలకుపైగా అవుతోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే లోపాలు జరిగాయని విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు శాఖ నివేదిక కూడా ఇచ్చింది. ఈ మేరకు ప్రారంభం నుంచి ఈ తాగునీటి పథకం పైపులైన్‌లు తరచూ పగిలిపోవడం వంటివి జరుగుతున్నాయి. ఇకపోతే ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ర్యాపిడ్ సాండ్ ఫిల్టరేషన్ బెడ్స్ వేశారు. అంటే నీటిని శుద్ధి చేసే సమయంలో బెడ్స్‌లో ఇసుక ద్వారా నీరు శుద్ధి అయి వస్తూ ఉంటాయి. ఈ బెడ్స్‌లోని ఇసుక సగటున మూడు నుంచి ఐదు సంవత్సరాలకు ఒకసారి మార్చాల్సి ఉంటుంది. అంటే పాత ఇసుకను తొలగించి కొత్తది వేయాలి. అప్పుడే నీటిశుద్ధి సామర్థ్యం మెరుగ్గా ఉంటుందని నిపుణులు చెబుతున్న మాట. అయితే వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు దీన్ని మార్పు చేసిన దాఖలాల్లేవు. ఈ విషయం సాక్షాత్తు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలనలో వెల్లడైంది. ఇక నిర్వహణ, కాంట్రాక్టు విషయాల్లో అనేక లోటుపాట్లు కనిపిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. 2024 మార్చి నాటికి పాత కాంట్రాక్టరు గడువు ముగిసింది. అయితే అధికారులేమో పాతవారిని కొనసాగిస్తున్నామని చెబుతుండగా, కాంట్రాక్టర్లు మాత్రం తమకు పొడగించమని అధికారిక ఉత్తర్వులేవీ ఇవ్వలేదని చెబుతుండటం గమనార్హం. దీంతో నిర్వహణలోనూ అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. కనగానపల్లి-రామగిరి, ఓడిసి సిపిడబ్లుఎస్ స్కీమ్‌లు దాదాపు మూతపడే దశకు వచ్చాయి. మరికొన్ని ఇదే విధంగా ఉన్నాయి.

వేతనాలకు వెతలు

ఈ మొత్తం స్కీముల్లో కలిపి సుమారు వెయ్యి మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. ప్రజలకు తాగునీటిని అందించడంలో వీరు అహర్నిశలు పనిచేస్తుంటారు. అయితే ఈ పనిచేసే కార్మికులకు నిత్యం పస్తులు తప్పడం లేదు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో సుమారు 600 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి ఆరు మాసాలుగా వేతనాలు అందలేదు. హిందూపురం డివిజన్ పరిధిలో అయితే ఏకంగా పది మాసాలుగా వేతనాల్లేవు. ఇక పిఎఫ్ అయితే 24 మాసాలుగా చెల్లించకుండా ఉన్నారు. ఈ వేతనాల కోసం కార్మికులు నిత్యం సమ్మెలు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. గతేడాదిలో మూడు సార్లు కార్మికులు సమ్మె చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 17 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలను చెల్లించాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వం నిర్ణయంతో మరింత దెబ్బ

గతంలో అధికారంలోనున్న వైసిపి ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్ క్వాలిటీ అసస్‌మెంట్ పేరుతో కొంత మంది ఇంజనీర్లతో తాగునీటి పథకాల నిర్వహణపై అధ్యయనం చేయించింది. ఈ కమిటీ పరిశీలించి నిర్వహణ మెరుగుకు సలహాలు కాకుండా ఖర్చును తగ్గించుకునే అంశాలపైనే ఎక్కువగా దృష్టి సారించిందన్న విమర్శ ఉంది. అందులో కీలకమైనది కార్మికుల సంఖ్యను కుదించమని సూచించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఇప్పుడు నడుస్తున్న మూడు షిప్టులను కాదని, దాన్ని రెండు షిప్టులకు మార్చాలని అందులో పేర్కొన్నట్టు సమాచారం. అయితే ఈ నివేదిక అధికారికంగా బయటకు వెల్లడవలేదు. దీని ఆధారంగా త్వరలో ఈ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించే అవకాశాలున్నట్టు కూడా తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని అదికారులెవరూ ధ్రువీకరించలేదు.



పిఎబిఆర్ వద్ద ఉన్న సత్యసాయి వాటర్‌ప్రాజెక్టు

భళిభళిరా.. బాలోత్సవం







- మదిని(ప)ండుగా జ్ఞాపకం..!
- మూడు రోజుల్లో వేల మంది విద్యార్థుల భాగస్వామ్యం
- ఎల్‌కెపి.. గిల్డ్‌ఆఫ్ సర్వీస్ స్కూల్‌లో పండుగ శోభ
- ముగిసిన 'అనంత బాలోత్సవం-5'
- ప్రతిభ కనబరిచిన వారందరికీ బహుమతులు

రెట్టించిన ఆనందం.. ఊహకందని ఉత్సాహం... ఆలోచన శక్తిని రగిల్చిన చైతన్యం... మాటల్లో చెప్పలేనంత సంతోషం.. పండుగలన్నీ ఒకే సారి పిల్లల ముందుకు చేరిన సందర్భం... మూడు రోజుల పాటు పసి హృదయాలను ఊలలాడించిన 'అనంత' బాలోత్సవం మదిలో చెదిరిపోని జ్ఞాపకాన్ని పిల్లల కనుల ముందు ఆనందాల హరివిల్లును ఆవిష్కృతం చేసింది. ఆటపాటలతో మెప్పించి... వైజ్ఞానిక ప్రదర్శనలతో ఆలోచింపజేసి... అందరినీ అకట్టుకునేలా ప్రతిభను బయటకు తీశారు.. తమకు అవకాశం ఇస్తే ఏమైనా చేయగలం అని 'బాల' చిచ్చర పిడుగులు నిరూపించారు. మూడు రోజుల పాటు ఆ'బాల'గోపాలాన్ని అలరిస్తూ ఉరిమే ఉత్సాహంతో 'అనంత'పండుగను తీసుకొచ్చిన పిల్లలు ఈ ఏడాదికి సెలివచ్చి, మళ్లీ ఏడు కలుద్దాం అంటూ బాలోత్సవం-5కు వీడ్కోలు పలికారు. బాలల సృజనాత్మక మేళవింపుగా సాగిన అనంత బాలోత్సవాలు ఆదివారం ముగిశాయి. మూడు రోజుల పాటు అనంత కేంద్రంగా జరిగిన ఈ పిల్లల పండుగ ప్రతి మదిలోనూ చెదిరిపోని జ్ఞాపకంగా మిగిలింది.

ఆద్యంతం ఉత్సాహ భరితం

మూడు రోజుల పాటు జరిగిన అనంత బాలోత్సవం-5 ఆద్యంతం పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. లలిత కళాపరిషత్, గిల్డ్‌ఆఫ్ సర్వీస్ స్కూల్ వేదికగా జరిగిన కార్యక్రమాలు అందరినీ సమ్మోహితులను చేశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను చాటుకునేందుకు పోటీపడ్డారు. వారిని ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆరాటపడ్డారు. నిత్యం చదువుల్లో మునిగితేలే విద్యార్థులకు ఈ మూడు రోజుల ఆటవిడుపు వారిలోని నూతనోత్సహన్ని నింపింది. ఈ ఉత్సహం పిల్లల్లోనే కాకుండా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో సైతం కన్పించింది.

ఆఖరి రోజు మరింత ఉత్సాహంగా....

బాలోత్సవం ఆఖరిరోజు మరింత ఉషారుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 9 వేల మందికి పైగా విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనాల్లో పాల్గొన్నారు. చివరి రోజు 65 ప్రదర్శనలు జరిగాయి. ఈ ఒక్క రోజే సుమారు 3 వేల మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తంగా మూడు రోజుల ఉత్సవాల్లో 160 పాఠశాలల నుంచి సుమారు 9 వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని వారి ప్రతిభను చూపారు.

మూడు రోజులుగా అనంతపురం లలితకళాపరిషత్ కల్లుసుబ్బారావు కళాక్షేత్రం లలితకళాపరిషత్ పూర్వపు కార్యదర్శులు ఎ.నరసింహమూర్తి, గాజుల నారాయణస్వామి ప్రాంగణంలో బాలోత్సవం ముగింపు సభ నిర్వహించారు. అనంత బాలోత్సవం కమిటి కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి అనంత బాలోత్సవం కమిటి ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లా, లలితకళాపరిషత్ కార్యదర్శి పద్మజ, రవికాంత్ రమణ, ఆర్ఐఒ వెంకట రమణ నాయక్, కేర్,క్యూర్ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ అభిషేక్ రెడ్డి, ఐఎంఎ రాష్ట్ర నాయకులు డాక్టర్ మురళీకృష్ణ, ఐఎంఎ జిల్లా ఛైర్మన్ డాక్టర్ కొండయ్య, మానవతా రక్తదాతల సంస్థ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉల్లాసం ఉత్తేజం

మూడు రోజుల పాటు చిన్నారుల కళా, వైజ్ఞానిక, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, వారి తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు వేలాదిగా హాజరయ్యారు. వివిధ ప్రదర్శనలు నిర్వహించి ఆనంద సంద్రంలో మునిగితేలారు. మట్టితో బొమ్మలు, పద్యం భావం, తెలుగులో మాట్లాడటం, జానపదనృత్యం, కోలాటం, నాటకీకరణ, క్లాసికల్ డ్యాన్స్, ముకాభినయం, కథలు చెప్పడం వంటి కార్యక్రమాల్లో విద్యార్థిని విద్యార్థులు చక్కటి ప్రదర్శనలతో అబ్బురపరిచారు.

అనంతరం ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఆర్ఐఒ వెంకట రమణ నాయక్ మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు ఆట పాటలు ఎంతో అవసరమని అన్నారు. పిల్లలు టీవీలకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి ఆట పాటల్లో పాల్గొనాలని సూచించారు. కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచి మంచి వ్యాయామ ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. ఎముకల పటుత్వానికి ఆకుకూరలు, కూరగాయలు తినడం అలవర్చుకోవాలన్నారు. ఐఎంఎ రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ మాట్లాడుతూ మంచి ఆలోచన విధానంతో సమాజంలో మెలగాలని, అప్పుడే మనం సాధించలేనిది ఏది ఉండదని అన్నారు. రవికాంత్ రమణ మాట్లాడుతూ అనంత బాలోత్సవానికి తన సతీమణి జ్ఞాపకార్థం సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉచిత కంటి ఆపరేషన్లు, 50 మంది పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ విద్య అందిస్తున్నట్లు తెలిపారు. లలితకళాపరిషత్ కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ అనంత బాలోత్సవం ఎల్‌కెపిలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని, ప్రతి ఏడాది ఇక్కడే నిర్వహించుకుంటే చక్కటి సౌకర్యాలు కల్పించి పిల్లలను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. అనంత బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫివుల్లా మాట్లాడుతూ అనంత బాలోత్సవం 5 ను విజయవంతం చేసిన విద్యార్థులు, తల్లి తండ్రులు, ఉపాధ్యాయ, విద్యా సంస్థల యాజమన్యానికి అభినందనలు తెలిపారు. కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ అనంత బాలోత్సవం జిల్లా ప్రజలందరిదిగా భావించి ఆదరిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. అందరి సహాయ సహకారాలతో అనంత బాలోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతబాలోత్సవ కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, కమిటీ సభ్యులు ఓతూరు పరమేష్, రమణయ్య, గోవందరాజులు, లింగమయ్య, కోటేశ్వరప్ప, సరళ, దేవేంద్రమ్మ, చిత్తప్ప, సుబ్బరాయుడు, శ్యామల, చంద్రిక, రామాంజినమ్మ, అశ్విని, బాలోత్సవ కమిటీ పోటీల న్యాయనిర్ణేతలు తిరుపాల్, సాధుశేఖర్, మంజునాథ్, రామగోవింద సాగర్, లక్ష్మి, శ్యామల, అశోక్, కత్తి విజయకుమార్, డాక్టర్ బృంద, రాజమోహన్, మాస్టర్ వన్నూర్, మధురశ్రీ, ప్రజ్ఞ సురేష్, శారద, ప్రసాద్, నబీరసూల్, పురంధరుడు, నారాయణస్వామి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్‌కెపి కార్యదర్శి పద్మజ



మాట్లాడుతున్న ఆర్ఐఒ వెంకటరమణనాయక్



విజేతలను అభినందిస్తున్న అతిథులు



జానపద నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

మోడీని ప్రశ్నించలేని ప్రధాన రాజకీయ పార్టీలు

సదస్సులో వామపక్ష పార్టీల నాయకులు

ప్రజాశక్తి - గుంతకల్లు

రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు మోడీని ప్రశ్నించలేని పరిస్థితిలో ఉన్నాయని, కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కలిసివచ్చే రాజకీయ పార్టీలను కలుపుకుని కేంద్రంపై వత్తిడి తేవాలని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక బిటి పక్కీరప్ప భవనంలో ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్టు ప్రత్యామ్నాయ విధానాలు అనే అంశంపై సిపిఎం,సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రామాంజినేయులు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రాన్ని మరోసారి దగా చేసిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ బడ్జెట్ ప్రతిపాదనలు ప్రజల ముందు ఉంచి నిధులు రాబట్టేందుకు కలిసి వచ్చే రాజకీయ పార్టీలను కలుపుకుని కేంద్రంపై పోరాటం చేయాలన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో అమరావతిలో రాజధాని నిర్మాణానికి, పోలవరం నిర్మాణం పూర్తి చేసేందుకు, విశాఖ ఉక్కు పరిశ్రమకు, రైల్వే జోన్, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయలేదన్నారు. మోడీని ప్రశ్నించే గుణం దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు లేకుండా పోయిందన్నారు.రాష్ట్ర ప్రజల మద్దతుతో ఎంపీలుగా గెలిచిన వారు కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పాటుకు కీలకం అయ్యారని అయితే రాష్ట్ర అభివృద్ధి కోసం నిధులు తేవడంలో విఫలం అయ్యారని విమర్శించారు. రాష్ట్రానికి పన్నుల రూపంలో రావాల్సిన రూ.12.50 వేల కోట్లు పెండింగ్ నిధుల ప్రస్తావన బడ్జెట్‌లో లేదన్నారు. పోలవరం ముంపు ప్రాంతాల బాధితులకు రూ. 25 నుంచి రూ. 40 వేలకోట్లు ఖర్చు అవుతుందని దాన్ని బడ్జెట్లో ప్రస్తావించలేదని అన్నారు. సిఎం చంద్రబాబు రాష్ట్రంలో డబ్బులు లేవని చెప్పడం సిగ్గు చేటని కేంద్రం నుంచి రావాల్సిన అదనపు నిధులు రాబట్టేందుకు కలిసి వచ్చే రాజకీయ పార్టీలను కలుపుకుని కేంద్రంపై పోరాటం చేయాలని అన్నారు. ఈ సదస్సులో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీ, జిల్లా నాయకులు గోవిందు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్ర స్వామి, సహయ కార్యదర్శి మహేష్, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, మూడు పార్టీల పట్టణ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్

'మిషన్ వాత్సల్య'తో పిల్లల పరిరక్షణ

జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో అంతర్భాగమైన మిషన్ వాత్సల్య పథకం ద్వారా పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాల వయసు వరకు అనాధల ఆదరణ సంరక్షణ అవసరమైన పిల్లలకు వసతి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ తెలిపారు. ఆదరణ కరువై దిక్కులేని బాలలకు తగిన ఆశ్రయం కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ శాఖ ద్వారా బాలల సంరక్షణ కార్యక్రమం చేపట్టింది. సమాజంలో మనం ఎప్పుడో, ఎక్కడో ఒకచోట చెత్త కుప్పలో డస్ట్ బిన్‌లలో, ముళ్లపొదల్లో అప్పుడే జన్మించిన పిల్లలను వదలి వెళ్లడం చూస్తూనే ఉంటాము. నవజాత పిల్లలను అలా విడిచిపెట్టడం వెనక ఆ తల్లికి వచ్చిన కష్టం ఏమిటో మనకు తెలియదు. సాధారణంగా ఏ తల్లి నవ మాసాలు మోసి ప్రసవం తరువాత అలా శిశువును వదిలించుకోవడానికి పలు కారణాలు ఉండవచ్చు. అలాంటి సంఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే పోలీస్ స్టేషన్ లేదా మహిళా శిశు సంక్షేమ అధికారులకు, అంగనవాడీ వర్కర్లకు సమాచారం ఇవ్వడం జరుగుతుంది. మరి కొంతమంది పిల్లలు తల్లిదండ్రులు ఆదరణకు కరువై జీవన పోరాటంలో బిక్షమెత్తుకుని తింటూ ఉండడం చూస్తుంటాం. అలాంటి ఆలనా పాలనా లేని నవజాత శిశువులు, అనాధల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బాలల సంరక్షణ శాఖ ద్వారా ఆదుకుంటోంది. ఈ నేపథ్యంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలు పలు అంశాలను వివరించారు.



ప్రశ్న : అనాధ, ఆదరణ కరువైన పిల్లల కోసం మీరు తీసుకొంటున్న చర్యలు ఏమిటి.?

జవాబు : ప్రభుత్వం ఇలాంటి అనాధలు, ఆదరణ కరువైన పిల్లల కోసం ప్రత్యేకంగా మిషన్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టింది. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాలు వయస్సులోపు ఉన్న వారిని గుర్తించి వారికి తగిన ఆశ్రయం కల్పించి సంరక్షించడం జరుగుతుంది. అందుకు ప్రత్యేకంగా ప్రభుత్వం బాలల కోసం బాల సదనాలు ఏర్పాటు చేసింది. వారికి ఆలనా పాలనా విద్య ఆశ్రయం కల్పించడం జరుగుతుంది.

ప్ర : జిల్లాలో ఎన్ని బాలల సదనాలు ఉన్నాయి.? వాటి పనితీరు తెలపండి.?

జ : సత్య సాయి జిల్లాలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా రెండు బాలల సదనాలు ఉన్నాయి. అవి ధర్మవరం, హిందూపురంలో ఉన్నాయి. ప్రతి బాల సదనంలో ఆశ్రయం కల్పించడంతోపాటు ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉచిత విద్య కల్పించబడుతుంది. ఇందులో అనాధలు, పాక్షిక అనాధ పిల్లలు, పోషించలేని స్థితిలో ఉన్న వారు ఇక్కడ చేర్పించడం జరుగుతుంది. ఈ బాల సదన్ లో బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆశ్రయం కల్పించడం జరుగుతుంది. అప్పుడే పుట్టిన పిల్లలు అనగా చెత్త కుప్పలో వదిలివేసిన పిల్లలను శిశుగృహంలో ఉంచి బాలల సంక్షేమ సమితి ద్వారా వారి సంబంధికులు రెండు నెలల వరకు కూడా రాని పక్షంలో అనాధగా ప్రకటించి చట్టబద్ధంగా దత్తత కోరేవారికి అప్పగించడం జరుగుతుంది. పూర్తి అనాధలకు, పాక్షిక అనాధలకు, మానసిక, శారీరక వికలాంగులకు, హెచ్ఐవి ఉన్న బాలలకు ప్రతినెల ఒక్కొక్కరికి నాలుగు వేల రూపాయలు ప్రభుత్వం మూడేళ్లపాటు సహాయం అందిస్తుంది.

ప్ర: మీ శాఖ ద్వారా ఇంకా చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి.?

జ: బాలల హక్కులు వారి సంరక్షణ, బాల్యవివాహాలు వలన జరిగే అనర్థాలు, బాలలపై జరిగే లైంగిక దాడులు తదితర విషయాల గురించి ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందుకు హెల్ప్‌లైన్ 1098 వినియోగించుకోవాలని కోరుతున్నాం. ఎక్కడైనా అలాంటి సంఘటనలు జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చు. జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్లో సంబంధిత అధికారులకు బాల్య వివాహాల నిరోధక చట్టం, లైంగిక నేరాల నిరోధక చట్టం, బాలల న్యాయ చట్టం పై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం.

ప్ర: కిశోరి వికాసం కోసం చేపడుతున్న చర్యలు ఏమిటి.?

జ: రాష్ట్ర ప్రభుత్వం కిశోరి వికాసం బాలల యొక్క సాధికారిక అనే నినాదంతో కలెక్టర్, ఐసిడిఎస్ పీడీ ఆదేశాలతో కిశోరి వికాసం పై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు చేపడుతుంటాము. బాల్యవివాహాలు నిరోధించడం, వ్యక్తిగత పరిశుభ్రత, యోగ, ఆత్మరక్షణ, ట్రాఫికింగ్ తదితర అంశాలపై ప్రతి మండలంలోని రిసోర్స్ పర్సన్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు శిక్షణ పొందిన వారు పాఠశాలల్లో, కళాశాలలో 11 నుంచి 18 ఏళ్ల వయసు గల వారికి అవగాహన కల్పించడానికి కృషి చేస్తారు. 11 నుంచి 14 ఏళ్ల బాల బాలికలకు గ్రూపులు ఏర్పాటు చేసి పిల్లల సమస్యలపై తెలుసుకోవడం జరుగుతుంది. బాల బాలికలు సమస్యలపై కరపత్రాలు, గోడ పత్రికల ద్వారా ప్రచారం చేయడం జరుగుతుంది.



బాలల సంరక్షణ జిల్లా అధికారి మహేష్

ప్ర : ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

జ: అనాధ పిల్లల పట్ల సానుభూతిగా ఉండాలి. గ్రామాల్లో బాల్య వివాహాలు, లైంగిక దాడులు జరిగిన వెంటనే అక్కడి అంగన్వాడీలకు. హెల్ప్ లైన్‌కు తెలపాలని కోరుతున్నాం. అలాగే గ్రామస్థాయి కమిటీలకు సహకరించాలని కోరుతున్నాం.

పోటీల్లో తృతీయ స్థానం సాధించిన దస్తగిరి



పథకంతో దస్తగిరి

రాయదుర్గం : బెంగళూరులో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా మిస్టర్ ఫిజిక్ పోటీల్లో రాయదుర్గానికి చెందిన దస్తగిరి 3వస్థానం సాధించాడు. 33ఏళ్ల కేటగిరిలో దస్తగిరి ప్రదర్శించిన బాడీ బిల్డింగ్ ఫైనల్‌లో మూడో స్థానం లభించింది. దీంతో నిర్వాహకులు పతకం, సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ దక్షిణ భారత స్థాయి పోటీల్లో పాల్గొనడం ఇదే తొలిసారి అని.. తొలి ప్రయత్నంలోనే మూడో స్థానం సంపాదించడం సంతోషకరమన్నారు. అఖిల భారత స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొని మరింత మెరుగైన ప్రదర్శన అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశాడు.

తాగునీటి సమస్య పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల


నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు పరిష్కరించడంతో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వేసవి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో నీటి సమస్య ఎక్కడ ఉందో గుర్తించి పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు కూడా తాగునీటి సమస్య ఉంటే అధికారులకుగానీ, తన దృష్టికిగానీ తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు అభివృద్ధితోపాటు సంక్షేమం అందించాలని సూచించారు.

లాభసాటి వ్యవసాయానికి చేదోడు

విప్ కాలవ శ్రీనివాసులు-రూ.2.25 కోట్ల డ్రిప్ పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-రాయదుర్గం

జిల్లాలో వ్యవసాయాన్ని లాభసాటిగా చేస్తూ రైతు బాగు కోసం ప్రభుత్వం తరపున ప్రజాప్రతినిధులు చేదోడుగా ఉంటున్నామని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి బి.రఘునాథ్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 223 మంది రైతులకు రూ.2.25కోట్ల విలువజేసే డ్రిప్ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు డ్రిప్ స్ప్రింక్లర్ విధానాన్ని అమలు చేయాలని అప్పటి ప్రధానికి సూచించారన్నారు. అంతేకాక దేశంలో తొలిసారిగా అనంతపురం జిల్లాలో అమలు చేశారని గుర్తు చేశారు. 2014-19 కాలంలో టిడిపి ప్రభుత్వం రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాల్లో 80వేల మంది రైతులకు డ్రిప్పులు, స్ప్రింక్లర్ విధానం ద్వారా వ్యవసాయానికి సాయం అందించినట్లు తెలిపారు. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్ని ఆటకెక్కించిందన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రాల్లో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఎక్కువమంది రైతులకు డ్రిప్ స్ప్రింక్లర్ విధానం ద్వారా లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో అత్యంత దుర్భిక్ష కరువు పరిస్థితుల దృష్ట్యా లబ్ధిదారులకు వ్యవసాయ భూమి పరిమితిని ఐదు నుంచి పదెకరాలకు పెంచి సబ్సిడీ మొత్తాన్ని 75 నుంచి 90 శాతానికి పెంచేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి రఘునాథరెడ్డి మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 12374 హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ అమలు చేయగా జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ ఏడాది 18000 హెక్టార్లకు డ్రిప్ సౌకర్యం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇప్పటికీ 12 వేల హెక్టార్లలో అనుమతులు మంజూరయ్యాయన్నారు. వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లో డ్రిప్ ఇరిగేషన్ పథకం అమలు చేయగా ప్రస్తుతం రాయదుర్గం నియోజకవర్గంలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 9699 మంది రైతులకు యూనిట్లు మంజూరు, కాగా రాయదుర్గం నియోజకవర్గం లో 1004 యూనిట్లు మంజూరయ్యాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ ఎపిడి ఫిరోజ్, మైక్రో ఇరిగేషన్ అధికారి లక్ష్మీనారాయణ, ఉద్యానవన శాఖ అధికారిని మౌనిక, టిడిపి నాయకులు సన్నన్న, హనుమంతు, గిరిమల్లెప్ప, లాలెప్ప, బలరామిరెడ్డి, ఉస్మాన్, వన్నారెడ్డి, ఆనందరాజు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు వ్యవసాయ పరికాలను అందజేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

జవాన్ లక్ష్మన్న అంత్యక్రియలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం





లక్ష్మన్న పార్థీవదేహం

మండల కేంద్రానికి చెందిన 61 బెటాలియన్ జవాన్ లక్ష్మన్న (33) అంత్యక్రియలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 14న ఓ రైలు ప్రమాదంలో లక్ష్మన్న మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరుకు వచ్చి అక్కడి నుంచి బిఎస్ఎఫ్ డిపార్ట్మెంట్ మినీ బస్సులో లక్ష్మన్న మతదేహంతో పాటు, భార్య లక్ష్మి, కుమార్తె జియా, కుమారుడు ఇయాన్‌తోపాటు బిఎస్ఎఫ్ సిబ్బంది సోమవారం మండల కేంద్రానికి రానున్నారు. ఇక్కడ ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి.

గౌతమిపై దాడి చేసిన నిందితుడిని శిక్షించాలి

రాయదుర్గం : అన్నమయ్య జిల్లా మదనపల్లిలో గౌతమిపై దాడి చేసిన నిందితుడిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పదవ తరగతి దళిత విద్యార్థిని సుగాలి ప్రీతి మృతిపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదన్నారు. ఏ ఆడపిల్లకు అన్యాయం జరిగినా తక్షణమే స్పందిస్తానన్న పవన్‌కళ్యాణ్ ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. అంతేగాకుండా దాడులు పెరిగిపోయాయన్నారు. గౌతమిపై యాసిడ్‌తో దాడి చేసి కత్తితో పొడిచిన గణేష్‌ను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అలాగే అన్నమయ్య జిల్లా మదనపల్లిలో గౌతమిపై యాసిడ్‌తో దాడి చేయడంతోపాటు కత్తితో పొడిచిన గణేష్‌ను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాయదుర్గం పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్.వంశీకృష్ణ ఆదివారం ఒక డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఇటీవల మహిళలు, విద్యార్థినులపై ప్రేమ, ర్యాగింగ్ పేరుతో అనేక రూపాలలో దాడులు అత్యాచారాలు తీవ్రంగా పెరిగిపోతున్నాయన్నారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం, హోంశాఖ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతిజిల్లాలో ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు కేంద్ర బడ్జెట్‌పై నిరసన

శింగనమల : ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలో నిరసన తెలపనున్నట్లు ఏపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ ఆదివారం ఒక తెలిపారు. బడ్జెట్‌లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. ముఖ్యంగా పేదలను విస్మరించి పెద్దలకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం బాధాకరమన్నారు. ఈనేపథ్యంలో బడ్జెట్‌ను నిరసిస్తూ నేడు చేపట్టనున్న నిరసనలో పెద్దఎత్తున ప్రజలు, ఉపాధి కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హరినామస్మరణతో మార్మోగిన అశ్వర్థం

మూడోవారం పోటెత్తిన భక్తులు



అశ్వర్థ నారాయణస్వామి దర్శణానికి క్యూలో వేచి ఉన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, భవానీ భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో ఆదివారం భక్తుల హరినామస్మరణతో అశ్వర్థం మారుమోగింది. శనివారం సాయంత్రం నుంచి భక్తుల తాకిడితో పెరగడంతో అశ్వర్థం కిటకిటలాడింది. ఈ సందర్భంగా భక్తులు ఉత్తర, దక్షణం ప్రవహించి పెన్నానదిలో తెల్లవారుజామునే పుణ్యస్నాణాలు ఆచరించి, పొంగుబాలు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాలోని భక్తులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో స్వామి దర్శణానికి గంటల సమయం పట్టింది. భారీ క్యూలైన్లు ఏర్పడ్డాయి. భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఇఒ సుబ్రమణ్యం తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నల్లపాటి, తిరుపతినాయుడు, శంకర్, కంటి ఆసుపత్రి బెంగళూరు ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని వాసవీ కళ్యాణ మండలంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ నేహా రోగులకు కంటి పరీక్షలు చేశారు. 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వీరిలో 68 మందిని శస్త్ర చికిత్స కోసం సిఫారసు చేశారు. ఈ సందర్భంగా పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పత్రా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జయరామ్‌రావు, కోశాధికారి షేక్షావలి, జిల్లా ఛైర్‌పర్సన్ డాక్టర్ శాంతిప్రియ, డాక్టర్ మురళీకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రోషన్ జమీర్, లయన్స్ క్లబ్ డైరెక్టర్లు గంగశేఖర్, ప్రసాద్, ఆర్గనైజింగ్ మేనేజర్ శివప్రకాష్, లక్ష్మీ ఆసుపత్రి, శంకర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఆర్టీసీ స్థలాలు

ఆందోళనలో వ్యాపారులు, నగరవాసులు



దుకాణాల వెనుక అపరిశుభ్రంగా ఉన్న ఆర్టీసీ స్థలం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

'ఈ బస్సు మనందరిదీ.. దీన్ని పరిశుభ్రంగా ఉంచుకుందాం' అని చెబుతున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు విలువైన రూ.కోట్ల విలువైన స్థలాలను గాలికి వదిలేశారు. దీంతో అసాంఘిక శక్తులు, అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. అనంతపురం నగర నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ సంస్థకు చెందిన స్థలాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. స్వయాన ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ కార్యాలయం, రీజినల్ మేనేజర్ కార్యాలయం పరిసరాల్లోనే ఇలా ఉంటే జిల్లావ్యాప్తంగా డిపోల పరిధిలో ఎలాంటి పరిస్థితులు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. కాసుల కోసం ఆర్టీసీ స్థలాలను అద్దెకు ఇస్తున్న అధికారులు వాటి చుట్టూ జరుగుతున్న పరిణామాలపై పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి సైపుల్లా బ్రిడ్జి వైపు చంద్ర ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఆర్టీసీ మైదానాన్ని పలు రకాల కమర్షియల్ ఎగ్జిబిషన్లకు అద్దెకిస్తున్నారు. ఇదే గ్రౌండ్లో దాదాపుగా 14 దుకాణాలను కూడా ప్రత్యేక నిబంధనల ప్రకారం ఆర్టీసీ సంస్థ అద్దెకు ఇచ్చింది. అయితే ఆ దుకాణాల వెనుక ఖాళీస్థలాలను గాలికి వదిలేయడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయని చెప్పవచ్చు. ఆదాయం వస్తున్నా ఉన్నతాధికారులు అటువైపు చూడకపోవడంతో నగరవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు చెత్తకుప్పలుగా మారిన ఆర్టీసీ స్థలాల పరిరక్షణ, పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ప్రజలతోపాటు వ్యాపారులు కోరుతున్నారు.

ఆర్టీసీ స్థలాలను పర్యవేక్షిస్తాం..

అనంతపురంలో ఖాళీగా ఉండి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉన్న ఆర్టీసీ స్థలాలను పర్యవేక్షిస్తాం. త్వరలో పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకునే ప్రయత్నం చేస్తాం.

పూల నాగరాజు, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్

పంచాయతీ రాజ్ వ్యవస్థ హక్కుల పరిరక్షణకు ఉద్యమం

వైసిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పంచాయతీ రాజ్ వ్యవస్థ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమం చేపడతామని వైసిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి హెచ్చరించారు. ఆదివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతోపాటు నిధులు దోచుకోవడంలో కూటమి నాయకులు ముందు వరుసలో ఉంటున్న ప్రశ్నిస్తానన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. మీరు ఇలానే ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేయడానికి వైసిపి పంచాయతీరాజ్ విభాగం ముందు వరుసలో ఉంటుందన్నారు. అలాగే ఉపాధి హామీ పనులను ప్రయివేటుకు ఇవ్వకూడదన్న హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని, ఉపాధి హామీ పనుల్లో 50 శాతం కూలీలకు చూపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో యంత్రాలతో పనులు చేయించడం, ప్రయివేటు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం చేయకూడదన్నారు. ఆయా సమస్యలపై హైకోర్టు ఆర్డర్లను ఇంప్లిమెంట్ చేయాలని సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ చట్టం అమలులో ప్రధాన భూమిక వహిస్తున్న జెడ్పీ సీఈవో, ఎంపీడీవో, పిఒ, ఏపీవోలు చట్టంలో చోటు చేసుకుంటున్న అవకతవకలకు పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రగతి పథంలో గుత్తి పట్టణ బ్యాంకు

ఛైర్మన్ ఎస్.అబ్దుల్ జిలానీ



మాట్లాడుతున్న ఛైర్మన్ ఎస్.అబ్దుల్ జిలానీ

ప్రజాశక్తి-గుత్తి

ది గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ప్రగతి పథంలో నడుస్తోందని బ్యాంకు ఛైర్మన్ ఎస్.అబ్దుల్‌జిలానీ అన్నారు. ఆదివారం పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్‌లో గుత్తి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బ్యాంకులో 4,446 మంది వాటాదారులు, రూ.5.96 కోట్లు మూలధనం ఉందన్నారు. రూ.119.36 కోట్లు డిపాజిట్లు, రూ.100.30కోట్ల రుణాలు ఇచ్చామని తెలిపారు. బ్యాంకుకు ఈఏడాది రూ.5కోట్ల ఆదాయం చేకూరుతుందన్నారు. పామిడిలో ఉన్న బ్యాంకు రూ.16.76 కోట్లు, అనంతపురంలో ఉన్న బ్యాంకు రూ.5.76 కోట్లు వ్యాపార లావాదేవీలు జరిగాయన్నారు. గుంతకల్లు, డోన్, కదిరి, రాయదుర్గంలో బ్రాంచుల ఏర్పాటుకు ఆర్‌బిఐ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. గుత్తి, ఆర్ఎస్, పామిడిలో తమ బ్యాంకుల ఎటిఎంలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కె.రాము, డైరెక్టర్లు కె.నాగరాజు, కృష్ణ, మాబు, జక్క వీరన్న, వెంకటేష్, సిఇఒ మహేశ్వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మార్కులతోపాటు నైతిక విలువలూ ముఖ్యమే..

ప్రజాశక్తి-అనంతపురం

నేటి సమాజంలో ర్యాంకులు, మార్కులు ఎంత ముఖ్యమో.. నైతిక విలువలు కూడా అంతే ముఖ్యమని తమిళనాడుకు చెందిన మౌలానా సులేమాన్ సాహెబ్ తెలిపారు. ఆదివారం నగరంలోని తాడిపత్రి రోడ్డులో ఎన్టీఆర్ మార్గ్ వద్ద ముస్లిం మైనార్టీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వసీలా ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూసేవా దక్పథంతో నేటి కాలానికి అనుగుణంగా గుణాత్మకమైన విద్యను అందించే విధంగా పాఠశాల యజమాన్యం కృషి చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీ సమాజంలో నిరక్షరాస్యత తక్కువగా ఉంటుందని గ్రహించి ముస్లిం కుటుంబంల్లోని పిల్లలను ప్రోత్సహించే దిశగా పని చేయడం సంతోషకరమన్నారు. పాఠశాల యాజమాన్యం అనుకున్న లక్ష్యాలను పూర్తి చేయడంతోపాటు దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం కార్యవర్గ సభ్యులు అస్లం, తాజ్, షాహుల్, మహమ్మద్ అస్లంరజాక్, రియాజ్, హిదాయతుల్లా, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

పిడియాట్రిక్ బ్రాంకోస్కోపీపై వర్క్‌షాప్‌నకు విశేష స్పందన

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని ఐఎంఎ హాల్లో ఆదివారం నిర్వహించిన పీడియాట్రిక్ బ్రాంకోస్కోపీపై వర్క్‌షాప్‌నకు విశేష స్పందన లభించిందని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జ్వాలాపురం శ్రీనాథ్ తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అకాడమిక్ కార్యకలాపాల్లో భాగంగా పీడియాట్రిక బ్రాంకోస్కోపీపై వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆధునిక సౌకర్యాల ద్వారా మెరుగైన వైద్యం గురించి పలువురు ప్రముఖులు విశ్లేషించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సహజీర్, డాక్టర్ యశోవర్ధన్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ చక్రధర్, డాక్టర్ జేపీ రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శ్రీనాథ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యాలరావు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, సిహెచ్‌సి ఇన్‌ఛార్జి రవికుమార్, నవీన్, హరిప్రసాద్, అంజనీకుమార్, డాక్టర్ సుధీంద్ర, ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, నిరంజన్‌రెడ్డి, డాక్టర్ కొండయ్య, డాక్టర్ జొన్న సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు : సిఐ



మాట్లాడుతున్న సిఐ వెంకటరమణ

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండలంలో ఎక్కడైనా ఇసుక, మట్టి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలో ఉన్న ట్రాక్టర్ల యజమానులకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే ట్రాక్టర్‌ను సీజ్ చేయడంతోపాటు యజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేవలం ఇల్లు కట్టుకోవడానికి, ప్రభుత్వ కార్యాలయ నిర్మాణాలు, రహదారుల నిర్మాణాలకు మాత్రమే ఇసుక తరలించాలన్నారు. అదికూడా అనుమతులు ఉంటుందని సూచించారు. ఎక్కడైనా డంపు చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తికేయకు స్మార్ట్ జీనియస్ గ్లోబల్ అవార్డు

ఉరవకొండ : మండలంలోని నెరమెట్ల గ్రామానికి చెందిన పర్వతప్ప, జయలక్ష్మి కుమారుడు కార్తికేయ స్మార్ట్ జీనియస్ గ్లోబల్ అవార్డును అందుకున్నారు. స్మార్ట్ జీనియస్ గ్లోబల్ లెవెల్‌లో భాగంగా గణితంలో ఐదు నిమిషాల్లో 50 ప్రాబ్లంస్‌ను సాల్వ్ చేసినందుకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులో ఉన్న రవీంద్ర భారతి ఆడిటోరియంలో లెవెల్ మ్యాథమెటిక్స్ అవార్డు ఫంక్షన్‌లో ఆ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అవార్డు అందజేశారు. కార్తికేయ ఉరవకొండలోని వివేకనంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నారు. చిన్న వయసులోనే గణితంలో అవార్డు సాధించినందుకు తల్లిదండ్రులతో పాటు వారి బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయదుర్గం : పట్టణంలోని రాయల్ కళాశాలలో ఎంపిఎ 2006-09 సంవత్సరంలో విద్యను ఆభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో కలుసుకున్నారు. ముందుగా కళాశాలలో పూర్వ విద్యార్థులు కలిసి జ్యోతి ప్రజ్వల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కళాశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను స్నేహితులతో పంచుకున్నారు. తర్వాత కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, మేనేజ్‌మెంట్ విక్రమ్, విజయ్, గంగాధర్, లెక్చరర్ బసవరాజు రమేష్ భట్‌కు సన్మానించారు. ఈ కార్యక్రమంలో 45మంది పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

అనంతపురం సిటీ : నగరంలోని 22వ డివిజన్‌కు చెందిన బాబాజీ, ఇసాక్‌వలితోపాటు దాదాపు 500 మంది ఆదివారం టిడిపిలో చేరారు. వీరికి టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చంద్రదండు ప్రకాష్‌నాయుడు, రాయల్ మురళి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్థలం మార్పు

రాయదుర్గం : రాయదుర్గంలో జరగనున్న సోమవారం జరగనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం స్థలంలో మార్పు చేసినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు జాతీయ రహదారి వద్ద ఉన్న డ్వామా కార్యాలయం ఉండగా ప్రజల సౌకర్యార్థం బళ్లారి రోడ్డు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న సీతారామాంజనేయ కళ్యాణ మండపంలోకి మార్చినట్లు తెలిపారు.

రాజావత్ నారాయణనాయక్‌కు డాక్టరేట్

అనంతపురం : ఆత్మకూరు మండలం తోపుదుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రాజావత్ నారాయణనాయక్‌కు అనువర్తిత గణిత శాస్త్రం (అప్లైడ్ మ్యాథమెటిక్స్) విభాగంలో యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈయన డాక్టర్ ఎస్.సునీత పర్యవేక్షణలో అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లో సిగ్నిఫికెన్స్ ఆఫ్ థర్మల్ రేడియేషన్ ఆన్ డిఫరెంట్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్ ఫ్లోస్ ఓవర్ ఏ స్ట్రెచ్చింగ్ సీట్ అండర్ వేరియస్ బౌండ్రి కండిషన్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కెఎస్‌వి కృష్ణారావు ప్రకటించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

రాయదుర్గం : ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞాన యుగంలో అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌తోపాటు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్ సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద సైబర్ నేరాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ అరెస్టులో ఉన్నారని, ఉన్నత అధికారులం అంటూ వీడియో కాల్స్ వస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ఫేక్ లోన్స్ యాప్‌ల బారిన పడవద్దన్నారు. వ్యక్తిగతంగా రుణాలు ఇస్తామంటూ తమ ఫొటోలను అడుగుతూ తిరిగి అదే ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరగాల ఉచ్చులో పడితే వెంటనే ప్రభుత్వం నిర్దేశించిన 1930కు కాల్ చేయాలని కోరారు.

సుంకర రమేష్‌కు ప్రతిభా పురస్కారం

అనంతపురం సిటీ : నగరానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు, రాయల్ యూత్ సొసైటీ ప్రతినిధి సుంకర రమేష్‌కు శ్రీకృష్ణదేవరాయ ప్రతిభ పురస్కారం దక్కింది. ఈమేరకు శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా తిరుపతి మహతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సుంకర రమేష్ అవార్డును అందుకున్నారు. రమేష్ ప్రతిభా పురస్కారం అందుకోవడంపై రాయల్ యూత్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళీధర్, ఎపి సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పతికి రమేష్ నారాయణ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి భరత్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సాకే శ్రీహరి మూర్తి, సాహిత్య భారతి, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కళాశాల విద్యార్థినుల నిరసన

ప్రజాశక్తి - గుత్తి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

జడ్పీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు కళాశాల గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు జువాలజీ పరీక్ష రాయడానికి వెళ్లగా అక్కడ మహిళా అధ్యాపకులు తమను వేధించారని ఆరోపించారు. మాస్ కాపీయింగ్ పేరుతో తమను సీసీ కెమెరా వద్ద సోదా చేసి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా అధ్యాపకులు అనుచితంగా ప్రవర్తించారని వాపోయారు. వేధింపులకు పాల్పడిన మహిళ అధ్యాపకులపై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

దంపతులకు గాయాలు



మృతిచెందిన రిత్విక్‌రెడ్డి

పెద్దవడుగూరు : దైవదర్శనం కోసం కుటుంబ సభ్యులందరూ వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా కారు ఢీకొనడంతో చిన్నారి మృతిచెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన పెద్దవడుగూరు మండలం కోటకొండ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని దిమ్మగుడికి గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి తన భార్య సులోచనతోపాటు ఇద్దరు కుమారులు రిత్వికరెడ్డి (3), సూరత్‌రెడ్డితో కలిసి పెద్దపప్పూరు మండలంఒలని ఆశ్వర్థం తిరుణాలకు ద్విచక్ర వాహనంలో వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా కోటకొండ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రిత్వికరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్యాభర్తలతోపాటు సూరత్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న వెంకటరామాంజనేయులుకి కూడా గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతిచెందిన ఆనందాచారి

నార్పల : మండల కేంద్రంలోని క్రాసింగ్ సమీపంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆనందాచారి స్థానిక దుగుమర్రి రోడ్డులో నివాసం ఉండేవాడు. అంతేగాకుండా ఇతడు కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడేవాడు. ఈనేపథ్యంలో అనుమానాస్పదంగా మృతిచెందడం విశేషం. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఐచర్ ఢీకొని వ్యక్తి...

శింగనమల : గార్లదిన్నె మండలంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని నిదనవాడ గ్రామానికి చెందిన తప్పెట లక్ష్మీనారాయణ (40) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. నిదనవాడకు చెందిన లక్ష్మీనారాయణ సొంత ఆటోలో బాడుగకు ఎనుముని తీసుకుని అనంతపురం వెళ్తుండగా గార్లదిన్నె మండలం కణంపల్లి-రాందాస్ పేట మధ్య ఐచర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆ ఇంట్లో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సజ్జలదిన్నె వద్ద మరొకరు..

తాడిపత్రి రూరల్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆలూరు గ్రామానికి చెందిన రంగనాయకులు (55) పని నిమిత్తం మోటార్ సైకిల్‌పై ఆలూరు నుంచి తాడిపత్రికి వస్తూ సజ్జలదిన్నె గ్రామం వద్ద మలుపు తిరుగు సమయంలో బుగ్గ నుంచి తాడిపత్రి వైపు వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో మోటార్ సైకిల్ లారీ వెనుక టైర్ల కింద పడి రంగనాయకులు తల నుజ్జునుజ్జయింది. రంగనాయకులు అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం రంగనాయకులు మతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పేకాటజూదరుల అరెస్టు

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పాలవెంకటాపురం అటవీప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.15వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. పాలవెంకటాపురం గ్రామ శివారులో కొత్తకొండ వద్ద ఉన్న అటవీప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.15వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని కెంచానపల్లి గ్రామంలో నాటుసారా తయారీ స్థావరాలపై ఆదివారం దాడి చేసి ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా సారా తయారీకి ఉపయోగించే 90 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమానితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. అనంతరం నాటుసారా వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. తర్వాత అనుమానితుల నివాసాల్లో సోదాలు చేశారు. ఈ దాడిలో ఎక్సైజ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామ సమీపంలో ముగ్గురు జూదరులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కడవకల్లు గ్రామ సమీపంలో జూదం ఆడుతున్నారన్న సమాచారం రావడంతో దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.32,250 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.